క్లుప్తంగా

విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలి



రాజేశ్వరరావు, ఏడీ

బూర్జ: ఖరీఫ్ సీజన్‌లో వరి విత్తనాలు ఎంపికలో పలు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయశాఖాధికారి వి.రాజేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మండలంలో ఎక్కువ మంది రైతులు ప్రైవేట్ ఏజెన్సీల వద్ద పురుగు, గడ్డి మందులు, విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా లైసెన్స్ పొందిన ఆధీకృత విత్తనాలే కొనుగోలు చేయాలన్నారు. బిల్లులపై కేంద్ర, రాష్ట్రం అమ్మకం పన్ను నంబర్, రైతు, గ్రామం పేరు, విక్రయదారుని సంతకం, తేదీ, విత్తన రకం, బ్యాచ్ నంబర్, గడువు తేదీ, నికర తూకం, నికర ధర, కంపెనీ పేరు, సరి చూసుకోవాలన్నారు. కొనుగోలు చేసిన సరుకు డీలరు వద్ద తూకం వేయించాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన బిల్లు పంట కాలం పూరయ్యే వరకు భద్రపర్చాలన్నారు. మొలకెత్తి పూత దశలో ఉన్నప్పుడు పంటలో తేడా కన్పిస్తే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు తెలియజేయాలన్నారు.

ఏఎంసీ చైర్‌పర్సన్ పదవికి రాజీనామా



రాజీనామా పత్రాన్ని ఏఎంసీ కార్యదర్శికి అందజేస్తున్న నిరూష

హిరమండలం: హిరమండలం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సారిపిల్లి నీరూష తన పదవికి సోమవారం రాజీనామా చేశారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారాన్ని కోల్పోవడంతో నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా లేఖను ఏఎంసీ కార్యదర్శి ఎం.కాలేశ్వరరావుకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ ఏఎంసీ వైస్ చైర్మన్‌తో పాటు కార్యవర్గ సభ్యులు కూడా రాజీనామాలను అందజేశారన్నారు.

కాలువను బాగు చేయాలి



పిచ్చిమొక్కలతో నిండిన హడ్డుబంగి గెడ్డ

కొత్తూరు: మండల రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధవుతున్నారు. ప్రధాన సాగు నీటి కాలువ అయిన హడ్డుబంగి గెడ్డ పూర్తిగా పిచ్చిమొక్కలు, ప్లాస్టిక్ వస్తువులు, పూడికలతో పేరుకుపోయింది. సిరుసువాడ, కుంటిభద్ర, మహార్తాపురం, పారాపురంతోపాటు పలు గ్రామాలకు చెందిన సుమారు వేయి ఎకరాలకు సాగునీరు అందే అవకాశం లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సుమారు రెండు కిలో మీటర్ల పొడవు ఉన్న హడ్డుబంగి గెడ్డను ఇరిగేషన్ శాఖ ఇంజినీరింగ్ అధికారులు బాగుచేసి సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

పూడికలు తొలగించాలి



పూడికలతో నిండిన వంశధార 6-ఎల్ పిల్ల కాలువ

ఎల్.ఎన్.పేట: వంశధార ప్రధాన కాలువలకు అనుసంధానంగా మండలంలోని వంశధార 6-ఎల్ పిల్ల కాలువలో పూడికలు తొలగించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. 6-ఎల్ పిల్ల కాలువ ద్వారా శివారు పంట పొలాలకు సాగునీరు అందటం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. సుమారు 800 ఎకరాలకు సాగునీరు అందించే కాలువలో పూడికలు, పిచ్చి మొక్కలు తొలగించేందుకు వంశధార అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉపాధి పనుల పరిశీలన



వసపలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ త్రివిక్రమరావు

కొత్తూరు: మండలంలోని వసప, పాతపాడు గ్రామాల చెరువుల్లో నిర్వహిస్తున్న ఉపాధి పనులను ఎంపీడీఓ త్రివిక్రమరావు సోమవారం పరిశీలించారు. వేతనదారుల హాజరును తనిఖీ చేశారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఉపాధి సిబ్బంది సూచించారు. సమయపాలన పాటించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన కొలతలు ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.300 వేతనం పొందవచ్చన్నారు.

● ఆర్థికసాయం



సారవకోట మండలంలోని గొర్రిబంద పంచాయతీ బురుజువాడ గ్రామానికి చెందిన గొర్లె మోక్షశ్రీ (రెండేళ్లు) గత కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతూ చికిత్స పొందుతోంది. ఈ విషయాన్ని బురుజువాడ గ్రామానికి చెందిన శివశంకర్ ద్వారా కుమ్మరిగుంట సచివాలయ వీహెచ్‌ఏ రవి సాహు తెలుసుకున్నారు. రవి సాహు తన మిత్రుల సాయంతో చిన్నారి కుటుంబ సభ్యులకు రూ.20 వేల ఆర్థికసాయాన్ని సోమవారం అందించారు.

\- సారవకోట

● రైతులు బిజీ.. బిజీ



ఎల్.ఎన్.పేట మండలంలోని పలు గ్రామాల్లో వరి విత్తనాలు వెద జల్లే పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు. మండలంలోని దబ్బపాడు, తురకపేట, కృష్ణాపురం, సిద్ధాంతం, బరటాం, సుమంతాపురం, చిట్టిమండలం, ఘుంగెన్నపాడు, దనకువాడ, మిరియాపల్లి, లక్ష్మీనర్సుపేట, బసవరాజుపేట తదితర గ్రామాల్లో రైతులు వెద జల్లే పనులను ముమ్మరంగా చేపట్టారు. ఒకటి, రెండు రోజుల్లో వర్షాలు పడితే అన్ని గ్రామాల్లోనూ ఖరీఫ్ పనులు ముమ్మరం అవుతాయని రైతులు చెబుతున్నారు.

\- ఎల్.ఎన్.పేట

● 68 మందికి వైద్య పరీక్షలు



బూర్జ మండలంలోని నీలాదేవిపురం గ్రామంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని బూర్జ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జి.రాజశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. 68 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. బీపీ, సుగర్, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి ఇళ్లకు వెళ్లి తనిఖీలు చేపట్టారు. పీహెచ్‌సీ హెల్త్ సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీ అలేఖ్య, ఏఎన్‌ఎం గౌరి, ఆశ కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

\- బూర్జ

నవధాన్యాల సాగుతో భూసారం



పంపిణీకి సిద్ధం చేసిన కిట్లు

నరసన్నపేట: ఖరీఫ్ పనులకు ముందు పొలంలో నవధాన్యాలు వేయడం ద్వారా భూసారం పెరుగుతుందని ఏపీసీఎన్ఎఫ్ స్టేట్ ఆఫీసర్ హేమసుందర్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో స్వయం శక్తి మహిళలు సిద్ధం చేసిన 200 నవధాన్యాల కిట్లను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కిట్లులో 9 రకాల ధాన్యాలు ఉన్నాయన్నారు. వీటిని పొలంలో వేసి కలియదున్నడం ద్వారా భూమి గుల్ల బారి పంటలు బాగా పెరిగేందుకు సహకరిస్తుందన్నారు.

ఒక్కో కిట్టు రూ.400లకు విక్రయించడం జరిగిందని, వీటిని రైతులు సక్రమంగా వినియోగించుకోవాలని వెలుగు డీపీఎం రేవతి, అసిస్టెంట్ డీపీఎం ధనుంజయ్ అన్నారు. నవధాన్యాల సాగు .. నేల తల్లికి బాగు.. అనే కార్యక్రమం చేపట్టామని తెలిపారు. వెలుగు ఏపీఎంలు సాయిలక్ష్మి, హేమసుందర్, సీసీలు, సీఎఫ్‌లు పాల్గొన్నారు.

పేర్లు నమోదు తప్పనిసరి



చిక్కాలవలసలో పేర్లు నమోదు చేస్తున్న ఏఓ సునీత

నరసన్నపేట: సబ్సిడీ వరి విత్తనాలు కావాల్సిన రైతులు సంబంధిత ఆర్‌బీకేల్లో పేర్లు నమోదు చేసుకుని, డబ్బులు చెల్లిస్తేనే వరి విత్తనాలు వస్తాయని, ఈ విషయాన్ని రైతులు గమనించాలని వ్యవసాయ శాఖ ఏడీ రవీంద్రభారతి, వ్యవసాయాధికారి కె.సునీత వేర్వేరుగా తెలిపారు. ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్, ఫోన్ తీసుకుని ఆర్‌బీకేకు వెళ్లి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ప్రస్తుతం ఎంటీయూ 1061, ఎంటీయూ 1064, ఎంటీయూ 1224, ఎంటీయూ 7029, ఆర్‌జీఎల్ 2537, ఎంటీయూ 1318, బీపీటీ 5204, ఎంటీయూ 1121 వంటి రకాల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఉర్లాం గ్రామంలో ఏడీ, చిక్కాలవలసలో వ్యవసాయాధికారి రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. ప్రైవేట్ మార్కెట్లో విత్తనాలు కొనుగోలు చేసే ముందు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విత్తనాలు అధిక ధరలకు విక్రయించినా, కృత్రిమ కొరత సృష్టించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



విత్తన దుకాణాన్ని పరిశీలిస్తున్న ఏఓ సంధ్య

హిరమండలం: రైతులకు అవసరమైన విత్తనాలు,ఎరువులు, క్రిమిసంహారక మందులు నాణ్యమైనవిగా ఉండాలని, నకిలీవి విక్రయించి రైతులకు మోసం చేస్తే లైసెన్సులు రద్దు చేస్తామని ఫర్టిలైజర్స్ దుకాణ యజమానులకు ఏఓ బి.సంధ్య హెచ్చరించారు. మండలంలోని శాస్త్రులపేటలోని దుకాణాన్ని తనిఖీ చేశారు. బిల్లులు చిత్తు కాగితాల్లో రాసి ఇవ్వకుండా ఒరిజినల్‌వి ఇవ్వాలని సూచించారు. విత్తనాలకు స్టోర్స్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలని, స్టాక్ రిజిస్టర్ ప్రతిరోజు అప్‌డేట్ చేయాలని, ధరలు పట్టిక తప్పనిసరిగా ప్రదర్శించాలన్నారు.

ఆడిట్ పరిశీలన



ఆడిట్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ రాంబాబు

హిరమండలం: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి పనుల కల్పనకు ప్రభుత్వం విడులచేసిన (సివిల్ వర్క్) ఎస్ఎంసీ పనుల నిర్వహణలో ఖర్చుచేసిన లావాదేవీలపై ఆయా ఉపాధ్యాయులు విధిగా ఆడిట్ చేయించుకోవాలని ఎంఈఓ కె.రాంబాబు అన్నారు.

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద నిర్వహిస్తున్న ఆడిట్‌ను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిరమండలంలోని 8 పాఠశాలలకు సంబంధించిన ఖర్చు, జమపై ఆడిట్ నిర్వహించడం జరుగుతుందన్నారు. పాఠశాల నిర్వహణకు సంబంధించి రికార్డులు పక్కాగా ఉండాలన్నారు. స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ టి.కేశవరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

8 ఎకరాల గడ్డికుప్పలు అగ్నికి ఆహుతి



సారవకోట: అగ్నికి ఆహుతి అవుతున్న గడ్డికుప్పలు, చెట్లు

సారవకోట: మండలంలోని గోవర్ధనపురం పంచాయతీ అర్లి గ్రామంలో ఆ గ్రామానికి చెందిన డొక్క దాసుకి చెందిన 8 ఎకరాల గడ్డి కుప్పలు, 7 కొబ్బరి చెట్లు, కాపుతో ఉన్న 3 మామిడి చెట్లు సోమవారం అగ్నికి ఆహుతయ్యాయి. పక్క పొలంలో వాళ్లు వారి పొలంలో ఉన్న గడ్డికి మంట పెట్టడంతో ఆ మంటలు వ్యాపించి దాసు పొలంలో ఉన్న గడ్డి కుప్పలు, చెట్లు కాలిపోయాయి. ఆర్థికంగా వెనుకబడి ఉన్న తమను అధికారులు ఆదుకోవాలని వారు కోరుతున్నారు.



పొందూరు: మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

గడ్డివాము దగ్ధం

పొందూరు: మండలంలోని దళ్లవలస గ్రామంలో మంగళవారం గడ్డివాము దగ్ధమైంది. రైతు తోట అప్పలనాయుడుకు చెందిన మూడు ఎకరాల గడ్డి కుప్ప మంటల్లో కాలిపోయింది. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారని రైతు ఆరోపిస్తున్నారు. పొందూరుకు చెందిన ఫైర్ హోమ్‌గార్డు రామకృష్ణ తన సిబ్బందితో వెళ్లి మంటలను నిలువరించారు.

రూ.50 వేల విరాళం



కమిటీ సభ్యులకు విరాళాన్ని అందజేస్తున్న బూర్లె శ్రీనివాసరావు

కొత్తూరు: మండలంలోని మెట్టూరు బిట్-2 (అడవికొత్తూరు) ఆర్ఆర్ కాలనీలో నిర్మిస్తున్న దుర్గమ్మ ఆలయానికి మెట్టూరు బిట్-1 ఆర్ఆర్ కాలనీకి (కృష్ణాపురం) చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు రూ.50 వేల విరాళాన్ని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు సోమవారం విరాళం అందజేశారు. విరాళం అందించిన శ్రీనివాసరావుకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు మురపాక శంకరరావు, అగతమూడి జగన్నాథం, పతివాడ ఎరుకు నాయుడు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

13న బహిరంగ వేలం

హిరమండలం: హిరమండలం మేజర్ పంచాయతీ కార్యాలయంలో ఈ నెల 13వ తేదీ ఉదయం 10 గంటలకు రోజువారి మార్కెట్ బస్టాండ్, కారు స్టాండ్ ఒకే పద్దు కింద, హిరమండలం, సుభలయ ఆర్అండ్ఆర్ కాలనీలో ఉన్న పిడబ్ల్యూఎస్ స్కీమ్‌ల నిర్వహణ, పైపులైన్ల రిపేరు పనులు చేసేందుకు ముగ్గురు పంపు ఆపరేటర్లు, పనుల నిర్వహణపై బహిరంగ వేలం నిర్వహించనున్నారు. ఈ మేరకు పంచాయతీ కార్యనిర్వహణ అధికారి వై.ఎస్.ఆర్.మూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనేవారు లక్ష రూపాయల విలువ చేసే సాల్వెన్సీ ధ్రువపత్రంతోపాటు రూ.30 వేల ధరావత్తు చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు మేజర్ పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

34 మంది గైర్హాజరు

నరసన్నపేట: స్థానిక కోర్ టెక్నాలజీలో సోమవారం ఏపీ పీజీ సెట్ పరీక్షలు ప్రశాంతగా ప్రారంభమయ్యాయి. మూడు సెషన్లలో పరీక్షలు నిర్వహించారు. 390 మందికి 356 మంది హాజరయ్యారు.

స్టాక్ పాయింట్ పరిశీలన



పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ రాంబాబు

హిరమండలం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన స్టాక్ పాయింట్‌ను ఎంఈఓ కె.రాంబాబు సోమవారం పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు సకాలంలో అందించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ ఏడాది పాఠశాలలు పునఃప్రారంభం రోజే పుస్తకాలు అందించడం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు వచ్చిన పుస్తకాలు స్కూల్ కాంప్లెక్స్‌ల వారీగా ప్యాక్ చేశామన్నారు. వాటిని అన్ని పాఠశాలలకు పంపిస్తామన్నారు. హెచ్ఎం టి.కేశవరావు, సీఆర్పీలు, ఎమ్మార్సీ సిబ్బంది ఉన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

శ్రీకాకుళం కల్చరల్: శివశ్రీ నృత్య కళానికేతన్ నృత్య దర్శకులు డాక్టర్ రఘుపాత్రుని శ్రీకాంత్ దర్శకత్వంలో 40 రోజులు నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం సోమవారంతో ముగిసింది. స్థానిక ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో మే ఒకటి నుంచి ఈ నెల పదో తేదీ వరకూ కూచిపూడి, భరత నాట్యంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు నృత్య దర్శకుడుశ్రీకాంత్ చెప్పారు. శిక్షణలో పాల్గొన్న 105 మందికి ప్రశంసాపత్రాలు అందచేశారు.

మహిళల జీవనోపాధికి కృషి



సర్టిఫికెట్లను అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: మహిళల జీవనోపాధికి హ్యూమన్ డెవలప్‌మెంట్ స్టూడెంట్స్ అసోసియేషన్ (హెచ్‌సీఎస్ఏ) ఎంతో కృషి చేస్తోందని నాబార్డు డీడీఎం కె.రామకృష్ణ అన్నారు. మండల పరిధిలోని ఒప్పంగి గ్రామంలో సోమవారం మిల్లెట్ ఫుడ్స్ శిక్షణలో భాగంగా సర్టిఫికెట్ల ప్రదానం చేసే కార్యక్రమాన్ని నాబార్డ్ సహకారంతో హెచ్‌సీఎస్ సంస్థ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లను అందజేశారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారు సొంతంగా వ్యాపారాన్ని ప్రారంభించి వ్యాపార మెలకులు నేర్చుకోవాలని నాబార్డ్ డీడీఎం ఆకాంక్షించారు. అనంతరం మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌డీఎస్ఏ వ్యవస్థాపకులు పీవీ రమణ, కేవీకే కోఆర్డినేటర్ భాగ్యలక్ష్మి ఉన్నారు.

పౌష్టికాహారం పంపిణీ



ఆమదాలవలస: భోజనాలు పంపిణీ చేస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు



సారవకోట: పండ్లు అందజేస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు

ఆమదాలవలస: మండలంలో అక్కులపేట పీహెచ్‌సీలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన పథకాన్ని వైద్యాధికారులు కె.మీనాకుమారి, వసంత సోమవారం ప్రారంభించారు. ప్రతి నెలా 9వ తేదీన పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పరీక్షలకు హాజరైన గర్భిణులు, వారి కుటుంబ సభ్యులు, వైద్య సిబ్బందికి ప్రతి నెలా అన్నదానం చేయడం సమితి సేవలకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమం గత ఏడు సంవత్సరాలుగా అంతరాయం లేకుండా నిర్వహించడం ఎంతో ఆనందాయకమన్నారు. ఈ నెల విశ్రాంత బ్యాంక్ మేనేజర్ బొడ్డేపల్లి సింహాచలం కుటుంబ సభ్యులు దాతలుగా వచ్చి పౌష్టికాహారాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బి.వసుమతి, సమితి జోనల్ కన్వీనర్ ఎం.జనార్దనరావు, సభ్యులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సారవకోటలో..

సారవకోట: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం గర్భిణులకు సత్యసాయి సేవా సమితి సభ్యులు పండ్లు పంపిణీ చేశారు. ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ కార్యక్రమంలో భాగంగా వైద్య పరీక్షలకు హాజరైన 28 మంది గర్భిణులకు ఈ పండ్లు పంపిణీ చేశారు. సారవకోట సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతి నెలా భోజనం, పండ్లు పంపిణీ చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

జేఈఈ అడ్వాన్స్ ర్యాంకర్లకు సత్కారం



రామలింగన్నాయుడును సత్కరిస్తున్న సర్పంచ్ అల్లు అసిరినాయుడు



రామలింగన్నాయుడును సత్కరిస్తున్న సర్పంచ్ అల్లు అసిరినాయుడు

నరసన్నపేట: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ర్యాంకులు పొందిన విద్యార్థులకు ఆయా గ్రామ పెద్దలు సత్కారించారు. నరసన్నపేట మండలానికి మంచి గుర్తింపు తీసుకువచ్చారని వారిని అభినందించారు. మండలంలోని దూకులపాడుకు చెందిన అల్లు రామలింగన్నాయుడుకు ఓబీసీ కేటగిరిలో 118వ ర్యాంక్, ఓపెన్ కేటగిరీలో 803వ ర్యాంక్ వచ్చింది. రామలింగన్నాయుడు డ్రైవర్ కుమారుడు. గ్రామ సర్పంచ్ అల్లు అసిరినాయుడు తదితరులు సోమవారం సత్కరించారు. ఉన్నత స్థాయిలో నిలిచి గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఆలిండియా ఓపెన్ కేటగిరీలో దేశస్థాయిలో 1265వ ర్యాంక్ పొందిన కోరాడ సాహ్‌దీప్‌కు జిల్లా కళింగకోమట్లు సంఘం ప్రతినిధులు అభినందించారు. తల్లితో పాటు సాహ్‌దీప్‌ను సత్కరించారు. కళింగ కోమట్ల సంఘం జిల్లా అధ్యక్షుడు తంగుడు జోగారావు, ప్రతినిధులు ఊణ్న వెంకటేశ్వరరావు, వైశ్యరాజు కేశవరాజు, జామి వెంకటరావు, ఊణ్న రంగనాథ్, బోయిన బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● నిర్మానుష్యంగా రోడ్లు



హిరమండలం: నిర్మానుష్యంగా ఉన్న ఏబీ రహదారి

హిరమండలం/కొత్తూరు: రోహిణీ కార్తె పది రోజులకు పైగా ప్రభావం చూపింది. ఉష్ణతాపం, ఉక్కబోతతో జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేసింది. వారం నుంచి మృగశిర కార్తె ప్రవేశించింది. ఎండ తీవ్రతతో పాటు ఉక్కబోత అలాగే ఉంది. గాలిలో తేమశాతం అధికంగా ఉండటమే ప్రస్తుత పరిస్థితికి కారణమని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు, మూడు డిగ్రీలు అధికంగా 36 నుంచి 40 డిగ్రీల మధ్య రికార్డు అవుతుంది. మరో రెండు, మూడు రోజులు ఇలాగే వాతావరణం కొనసాగుతుందని వాతావరణశాఖ నిపుణులు చెబుతున్నారు. సోమవారం కొత్తూరు, హిరమండలం మండలాల్లో 42 డిగ్రీ ఉష్ణోగ్రత నమోదైంది.



కొత్తూరు: నిర్మానుష్యంగా ఉన్న కొత్తూరులోని ప్రధాన రహదారి